

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గత సంచిక తరువాయి)

**నెమ్మదిగా** లేచి లిఫ్ట్ వైపు నడుస్తూ ఆగాడతడు.

"దయచేసి నన్ను ఎవరూ డిస్టర్బ్ చెయ్యకండి. నాకు విశ్రాంతి కావాలి" అంటూ లిఫ్ట్ ఎక్కాడు. లిఫ్ట్ పైకి వెళ్ళిపోయింది.

భారంగా నిట్టూర్చాడు అరుణ్.

రూములోకి వస్తూనే కాళ్ళ చెప్పులను దూరంగా పడేలా విదిలించి పడేశాడు. టేబుల్ పైన ఉన్న వాటర్ బాటిల్ తీసుకుని తాగాడు. బెడ్ పై వాలిపోయాడు హేమంత్.

జరిగిన, జరుగుతున్న సంఘటనలకు సంబంధించిన ఆలోచనలతో అతడి మనసు అల్లకల్లోలంగా తయారైంది. గతపు అనుభవాలు అతడి కళ్ళలో నీటి బొట్లుగా మారి అతడి చెంపలను తడుపుతున్నాయి.

వైజాగ్‌లో మెడిసిన్‌లో సీటు వచ్చింది. అంతదూరం వెళ్ళిపోకుండా దగ్గరగా ఢిల్లీలో చేరమని అమ్మ, నాన్నగారు చెప్పారు. వారంతగా బ్రతిమలాడినా కూడా, అంతగా చెప్పినాకూడా తన మనసు మార్చుకోలేకపోయాడు.

ఆ రోజు, ఆయన మాట విని వైజాగ్‌కు వెళ్ళకుండా ఉండి వుంటే లత తన జీవితంలోకి ప్రవేశించేది కాదు. లతకు, తనకు కూడా ఈ బాధా, నరకం వుండేవి కావు. అతడి మనసులో గతపు అనుభవాల తాలుకు జ్ఞాపకాలు దృశ్యాలుగా మారి ఒకదాని వెంట ఒకటిగా కళ్ళల్లో పరుగులు తీస్తున్నాయి.

"హేమంత్ ఏం ఆలోచిస్తున్నావురా?" అంటూ వచ్చి కొడుకు మంచం మీద కూర్చుంది వసుమతి.

ఇటువైపు తిరిగాడు హేమంత్.

"ఏం లేదమ్మా" అంటూ లేచి కూర్చున్నాడు.

"హేమంత్, ఎందుకురా ఇంత మొండి పట్టు పడుతున్నావు? నాన్న చెప్పినట్టు ఢిల్లీలో చేరవచ్చు కదరా" అంది కొడుకు తల నిమురుతూ వసుమతి.

"వసూ వాడిని బలవంత పెట్టకు పాపం. హేమంత్ వైజాగ్‌లోనే జాయిన్ అవ్వాలని తీసుకున్న నిర్ణయానికి తన కారణాలు తనకు ఉంటాయి. అక్కడ తనకు ఫ్రెండ్స్ వుంటారు. పైగా నీ చెల్లి ప్రభావతి దగ్గర చాలా చనువుకదా వాడికి. ఇక మేనమామ గోపాల్ అయితే అసలే గారాబం చేశాడు. అక్కడ ఆ కజిన్స్ ఉంటారు వాడికి కంపెనీగా, ఇక్కడ ఎవరూ లేరు కదా. వాడి మనసుకు నచ్చినట్టే చెయ్యినియ్యి" తండ్రి అభిజిత్ అన్నాడు అక్కడనుంచి వెళ్తూ.

"నువ్వు మమ్మల్ని వదిలి అంత దూరం వెళ్తున్నావు అంటే చాలా బాధగా వుందిరా హేమంత్. నాన్న ఎపుడూ నీ గురించే ఆలోచిస్తూ ఉంటారు.

"అమ్మా, అలా దిగులుపడొద్దు. ఒకటి చెప్తాను విను. నాన్నగారు, నువ్వు మానవసేవ కోసమే పుట్టారనిపిస్తుంది. ఏ రోజైనా, మీ మొబైల్ క్లినిక్‌కు విశ్రాంతిని ఇచ్చారా? నిరుపేదల సేవే మీ లక్ష్యం. నాకు తెలిసినప్పటినుంచీ చూస్తున్నా. నన్ను ఆయా దగ్గర వదిలి, లేకపోతే స్కూలుకు పంపించేసి, ఉదయం వెళితే ఏ సాయంత్రానికో వచ్చేవారు. ఇప్పటికీ మీ దినచర్యలో ఇంతైనా మార్పులేదు. ఓపిక తగ్గుతుంది, మీకు విశ్రాంతి అవసరం అన్న నా మాట వినిపించుకోరు" బాధగా ఉంది హేమంత్ స్వరం.

"అమ్మా. ప్లీజ్ దిగులు పెట్టుకోకండి. ఎప్పుడు మీరు పిలిస్తే అప్పుడు వచ్చి మీ ముందు వాలతాను. నన్ను నాకు ఇష్టమైన  చోటుకు వెళ్ళనివ్వండి. నాకు ఎందుకో ఇది మన ప్లేస్‌లా అనిపించదు."

"అవునులే హేమంత్. బిడ్డవు. నీకు న్యాయం చెయ్యలేకపోయాను నేను. మీ నాన్న తలపెట్టిన సేవా కార్యక్రమాలలో పాల్గొనటం చాలా ఇష్టం నాకు. పూర్తిగా ఆయనకే అంకితమైపోయి ఆయన వెంట నడవటం అలవాటైపోయింది."

హేమంత్ నెమ్మదిగా జారి ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు. అతడి కన్నీరు తల్లి ఒడిని తడుపుతుంది. చెమ్మగిల్లిన కళ్ళతో హేమంత్ తల నిమురుతు వుండిపోయింది వసుమతి.

"అమ్మా, నీకు నాన్నగారికి నా గురించి పట్టించుకునే సమయం దొరకదు. నేను హైస్కూల్ నుంచి ఈ క్షణం వరకు కూడా ఒంటరి తనాన్ని అనుభవిస్తూ ఇక్కడే చదువుకున్నాను. కాని ప్రాణంగా భావించుకునే ఒక్క స్నేహితుడు కూడా లేడు. యాంత్రికంగా గడుపుతున్నాను.

"కాని ఇపుడు నా మనసు ఎందుకో కొంతకాలం, అంటే మెడిసిన్ అయ్యేవరకైనా 'మన' అనిపించే మనుషుల మధ్య ఉండాలనీ, కొంచెం జీవితాన్ని జీవించాలనీ కోరుకుంటుంది. నన్ను నీ కన్నీళ్ళతో దగ్గరకు తీసుకున్నావ్.. కానీ  నా మనసు జీవితాన్ని వెతుక్కుంటూ కన్నీరు కారుస్తుందమ్మా"

మౌనంగా ఉండిపోయింది వసుమతి. హేమంత్ గుండెలో దాగివున్న బాధ అర్థమైంది ఆమె తల్లి మనసుకు. హేమంత్‌ను వైజాగ్ పంపించాలి అని నిర్ణయించింది ఆమె మనసు.

అలాగే, పసిపిల్లాడిలా నిద్రలోకి జారుకున్నాడు హేమంత్. నెమ్మదిగా అతడి తలక్రింద దిండును ఉంచి లేచింది ఆమె.

అతడి నుదుటిపై పెదవులతో తాకింది. అతడి పై రాలబోయిన కన్నీటి బొట్టును కంగారుగా చేత్తో ఆపి, నెమ్మదిగా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది వసుమతి.

హేమంత్ నిద్రలేచేసరికి అభిజిత్, వసుమతిలు ఇద్దరూ తయారైపోయి వెళ్ళే హడావిడిలో ఉన్నారు. ఎనిమిది అవుతుంది అనుకున్నాడు క్లాక్ వైపు చూసి.

రెండు రోజుల్లో తను వైజాగ్‌కు వెళ్ళిపోతున్నాడు. ఈ రెండు రోజులూ తల్లితండ్రులకు దగ్గరగా వుండాలి అనిపించింది అతడికి.

బాల్కనీలోంచి "అమ్మా ఆగండి" అని చెప్పి పదినిమిషాలలో రెడీ అయిపోయి క్రిందకు వెళ్ళాడు.

అప్పటికే స్టీరింగ్ ముందు కూర్చుని వున్న అభిజిత్‌కు

"గుడ్ మార్నింగ్ డాడ్" చెప్పాడు హేమంత్.

"గుడ్ మార్నింగ్ మై సన్" అన్నాడతడు.

"హేమంత్, నీకు అన్నీ టేబుల్‌పై సర్దాను. ఫాతిమా చూస్తుందిలే. మరి వెళ్ళమా?" అంది కొడుకు చూపులలో భావాన్ని గ్రహించిన ఆమె చూపును మరల్చుకుంది.

ఆమెకు దగ్గరగా వెళ్ళి చేతులు పట్టుకున్నాడు హేమంత్.

"నేనూ వస్తానమ్మా మీతో" అంటున్న హేమంత్ వైపు నమ్మలేనట్టు చూసింది ఆమె.

అది ఒక మినీ ట్రక్. క్యాబిన్‌లో ఒకటే ఒక సీటు.

తండ్రి పక్కన హేమంత్, ఆ తర్వాత వసుమతి కుర్చున్నారు. వెనకాల కారియర్‌లో ఇద్దరు అబ్బాయిలు రామ్ సింగ్, లక్ష్మణ్ లు కూర్చున్నారు.

"ఇది నాకు కొత్త ఎక్స్‌పీరియన్స్ డాడ్" అన్నాడు నవ్వుతూ.

"నాకూ ఇన్నర్‌గా నువ్వు వస్తే బాగుండును అనిపించింది." కొడుకు చేతిని చేతిలోకి తీసుకుని గుండెకు హత్తుకున్నాడు అతడు. కళ్ళలో తిరిగిన నీటి పొరను హేమంత్ నుంచి దాస్తూ ట్రక్‌ను స్టార్ట్ చేశాడతడు.

వేగాన్ని పెంచుతున్న తండ్రివైపు ఒకసారి చూసి మౌనంగా కూర్చున్నాడు. కాని అతడి మనసులో మాటలు పైకే వచ్చాయి.

"డాడీ మీరు డాక్టరై వుండి, ఇలా వ్యాన్ నడుపుతూ ఊరుపూరు తిరుగుతూ వైద్యం చేస్తున్నారు, మీకు తోడుగా అమ్మ. మీ ఇద్దరికీ ఒక జీవితంలో విశ్రాంతి అవసరం డాడీ. హాస్పిటల్‌లోనే ఈ సేవలు చేయొచ్చుకదా"

"నా బిడ్డగా నువ్వు చెప్పేది కరక్టే హేమంత్. హాస్పిటల్‌కు డబ్బు ఎఫర్ట్ చెయ్యగలిగిన వాళ్ళే వస్తారు. పాపం, మారుమూల రిమోట్ ఏరియాస్‌లోని పేదలు, స్లం ఏరియాస్‌లో వుండే శ్రమ జీవులు దగ్గరకు నేనే వెళ్ళాలి, వాళ్ళు రాలేరు. వాళ్ళందరికీ నా అవసరం వుంది."

మధ్యలోనే అడ్డువస్తూ అన్నాడు హేమంత్ ఆవేదనగా, "కాని నాకు కూడా మీ అవసరం ఉంది డాడ్. అమ్మ, మీరు ఇక మీకోసం మీరు జీవించేది ఎపుడు? మీ లక్ష్యం, ఆదర్శం అంటూ ఇంత త్యాగం చెయ్యాలా చెప్పండి?"

"దీన్ని త్యాగం అదీ ఇదీ అని అనొద్దు. ఇందులోనే నా సంతోషం వుంది. ఇదే జీవితం అనిపిస్తుందిరా" ఎడమ చేత్తో కొడుకు చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు అతడు.

"డాడ్.. మీ లక్ష్య సాధన కోసం మీరు నన్ను అనేకసార్లు ప్రభావతి పిన్ని దగ్గర, గోపాల్ మామయ్య దగ్గర వదిలేసేవారు. అపుడు నాకోసం బాధనిపించలేదా మీకు? ఇప్పుడూ కూడా మన మధ్య చాలా దూరం అనిపిస్తుంది నా మనసుకు. నేను మీతోనే వుండి కూడా మిమ్మల్ని మిస్ అవుతున్నాను."

వసుమతి, కొడుకు చేతిని చిన్నగా తగి, ఆ మాటలు ఆపమన్నట్టు సైగ చేసింది.

వాహనాన్ని రోడ్డు పక్కకు తీసి ఆపేశాడు అభిజిత్. అతడు నెమ్మదిగా డోర్ తీసుకు దిగాడు.

"మీరూ దిగండి, కాసేపు అలా నడుద్దాం" అన్నాడు భార్యను, కొడుకును ఉద్దేశించి. అతడు నెమ్మదిగా ముందుకు నడుస్తూ వెను తిరిగి చూశాడు.

వసుమతి డోర్‌ను ఓపెన్ చేసింది. క్రిందకు దిగుతూ కొడుకు చేతిని తన చేతిలోకి తీసుకుని అతడి ముఖంలోకి చూసింది.

"హేమంత్, నీకు మీ నాన్న సంగతి తెలుసుగా. చిన్న మాటకు, సమస్యకు కూడా అప్‌సెట్ అవుతారు. నీ ఇష్టప్రకారమే వైజాగ్‌లోనే జాయిన్ అవుదువుగాని. అలా మాట్లాడి ఆయన మనసును నొప్పించకురా.. ప్లీజ్" అంటున్న తల్లి చేతిని రెండు చేతులతో పట్టుకుని చిన్నగా పెదవులకు ఆనించుకుని "సరే అమ్మా.. సారీ" అన్నాడు కళ్ళలో నీటిపొర ఆమెకు కనపడకుండా ముఖం తిప్పుకుని దిగబోతున్న కొడుకుతో అంది వసుమతి.

"నీ మాటలలో న్యాయం వున్నా, ప్రస్తుతం ఏ మార్పులూ చెయ్యలేనంతగా ఈ కార్యక్రమాలలో మునిగిపోయి ఉన్నారు మీ నాన్న."

చిన్నగా తల పంకించి, నెమ్మదిగా దిగి వెళ్ళి రోడ్డు పక్కన వున్న చెట్టు క్రింద నిలబడ్డాడు హేమంత్. అతడి మనసు అలజడికి లోనైంది.

'వీళ్ళని వదిలి వెళ్ళటానికి మనస్కరించటంలేదు. అలా అని ఇక్కడ వున్నాగాని వాళ్ళకోసం చెయ్యగలిగింది కూడా ఏం కనిపించటంలేదు" అతడి మనసు అశాంతికి గురైంది.

పక్కనే కమలాతోట వుంది. చెట్లనిండా ఆరెంజ్ కలర్‌లో పళ్ళు ఉన్నాయి. అక్కడ వున్న కాపలా వ్యక్తితో మాట్లాడాడు అభిజిత్. ట్రక్‌లో వెనక వున్న రాంసింగ్, లక్ష్మణ్‌లను పిలిచాడు అతడు. వాళ్ళు పరుగున వచ్చారు.

చాలా ఎక్కువ సంఖ్యలో పళ్ళను కొనటం చూసి, "అన్ని ఎందుకమ్మా?" తల్లి అడిగాడు హేమంత్.

పేషెంట్లకూ, శరణాలయాల్లో ఉన్న వృద్ధులకు, ఇంకా మాకోసం ఎదురు చూసే నిరుపేదలకు పంచుతారు" చెప్పింది వసుమతి.

నాలుగైదు సంచులనిండా పళ్ళు తెచ్చి ట్రక్‌లో పెట్టారు రాంసింగ్, లక్ష్మణ్‌లు.

మళ్ళీ బయల్దేరింది వాహనం. అంతకంతకు వేగం పెంచుతున్న తండ్రివైపు చూసి, "స్లో చెయ్యండి డాడ్, ఇంత స్పీడ్ అవసరమా" అన్నాడు హేమంత్.

బిగ్గరగా నవ్వాడు అభిజిత్ "చిన్నప్పుడు 'ఇంకా స్పీడ్' అంటూ అన్ని కార్లను ఓవర్‌టేక్ చెయ్యమనేవాడివి"

"ఈ రోజు నేను ఉన్నాను మీతో. రోజూ ఇలాగే డ్రైవ్ చేస్తారా?"

"నువ్వు వున్నందువల్లే ఈ వేగం, ఈ హ్యాపీనెస్"

"డ్రైవర్‌ను తీసుకోమంటే వినరురా హేమంత్ మీ నాన్న." వసుమతి చెప్పింది.

"నాకు కార్ రేస్‌లంటే చాలా ఇష్టంగా వుండేది హేమంత్"

"విన్ అయ్యారా ఎపుడైనా?"

"ఆ అవకాసమే లేకుండా మెడిసిన్ చదివించారు మా నాన్న, అదే మీ తాతయ్య."

"అవునా?" అని మౌనంగా వుండిపోయాడు హేమంత్.

అభిజిత్ కూడా మరేం మాట్లాడలేదు.

ఆ తర్వాత స్లోగా డ్రైవ్ చేసాడతడు. సడన్‌గా తల్లిదండ్రులిద్దరు మౌనం వహించటం గమనించాడు హేమంత్.

అంతలో ఒక పారిశ్రామిక వాడను చేరుకున్నారు.

పిల్లలు పెద్దలు చాలామంది పరుగున వచ్చారు ఆగగానే.

లక్ష్మణ్, రాంసింగ్‌లు ఇద్దరూ వెనుక డోర్ దించి, నాలుగు కుర్చీలను, రెండు బల్లలను వేశారు చెట్ల క్రింద.

మెడికల్ ఎక్విప్‌మెంట్ అంతా ఒక బల్ల మీద సర్దారు.

వచ్చిన వారిలో వృద్ధులూ, పిల్లలూ, స్త్రీలు ఎక్కువగా వున్నారు. వారందరినీ కూడా, వారి పేర్లతోనే పిలిచి మాట్లాడుతున్నారు అభిజిత్, వసుమతిలు.

అనారోగ్యంగా ఉన్నవారికి స్టెత్‌తో చూస్తున్నారు. థర్మామీటర్ పెట్టి టెంపరేచర్ చూస్తున్నారు. వారి కష్టసుఖాలను కూడా అడిగి తెలుసుకుంటున్నారు.

అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ టాబ్లెట్లు, సిరప్‌లు ఇచ్చి, అవి ఎలా వేసుకోవాలో చెప్తుంది వసుమతి.

అభిజిత్ చెప్తున్న ఇంజెక్షన్‌లను లోడ్ చేసి, కొన్ని అతడికి ఇస్తూ, కొన్ని తను చేస్తుంది ఆమె.

వృద్ధులకు, పిల్లలకూ బ్రెడ్ ప్యాకెట్లు, బిస్కట్ ప్యాకెట్లు ఇచ్చారు. అందరికీ పళ్ళు పంచారు. వాళ్ళ సంతోషానికి అవధులు లేవు. పెద్ద అట్టపెట్టెలలోనుంచి అందరికీ బట్టలు, రగ్గులు, దుప్పట్లు ఇచ్చారు. ఆ ప్రాంతం అంతా కోలాహలంగా తయారైంది.

వసుమతి వారికి రోజూ స్నానం చెయ్యాలి అని చెప్తూ సబ్బులు ఇచ్చింది. వారి పసిపిల్లలను దగ్గరకు తీసుకుంది ఆమె.

వారందరికీ పరిసరాల పరిశుభ్రత పాటించమని చెప్తూ, తనే మురికినీటి కాలువలలోను, ఇతర మురికిగా వున్న ప్రదేశాలలోను ఫినాయిల్ చల్లింది వసుమతి.

వాళ్ళకు తగిన సలహాలిచ్చి వెనుతిరుగుతున్న సమయంలో చాలామంది పరుగున వచ్చి అభిజిత్ , వసుమతిల పాదాలను తాకి నమస్కరిస్తున్నారు. వారిని వారించి దగ్గరకు తీసుకుంటున్న తల్లిదండ్రులను మౌనంగా చూస్తూ ఉండిపోయాడు హేమంత్.

ట్రక్‌ను స్టార్ట్ చేస్తూ "ఇదిరా జీవితం హేమంత్" అన్నాడు అభిజిత్. హేమంత్ కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. మౌనంగా వుండిపోయాడు.

అదే విధంగా మరో రెండు మురికి వాడలకు వెళ్ళారు. ఆ జనం అందరూ తన తల్లితండ్రులను తనకంటే ఎక్కువగా ప్రేమిస్తున్నారు అనిపించింది అతడికి.

శరణాలయంలో వృద్ధులను, అనాధాశ్రమంలోని పిల్లలను పేరుపేరున పలకరిస్తున్న తల్లితండ్రులని ఆశ్చర్యంగా చూశాడు హేమాంత్. అక్కడ పనివారిని కొన్ని విసహాయాలు అడిగి తెలుసుకుని, వారికి కొన్ని సూచనలిచ్చింది ఆమె.

తల్లితండ్రుల చుట్టూ ఎంతో చనువుగా, సంతోషంగా చేరిన పిల్లలను, వృద్ధులను చూసిన అతడి మనసుకు, మానవత్వానికి కొత్త నిర్వచనాలు దొరికాయి.

ఇన్నాళ్ళూ, వారు తనకే స్వంతం అన్న భావన వుంది అతడి మనసులో. వారిని ప్రేమించటానికి ఇంకా ఇందరు వున్నారని తెలిసిన అతడి మనసులో ఒక ఘర్షణ మొదలైంది.

తన ఆలోచన తప్పా? భౌతికంగా, వారికి విశ్రాంతి కరువైంది అని బాధపడుతున్న అతడికి, ఇందరి ప్రేమానురాగలే శక్తిని ఇస్తున్నాయి అనిపించింది.

మౌనంగా తింటున్న కొడుకు ముఖం గంభీరంగా ఉండటం చూసి "రేపు రాత్రే నీ ప్రయాణం హేమంత్, అన్నీ సర్దుకున్నావా?" అడిగాడు అభిజిత్.

ఉలిక్కిపడి చూసిన హేమంత్ "సర్దుకున్నాను డాడ్" అన్నాడు.

మరో చపాతీ ప్లేట్లో వెయ్యబోయిన తల్లిని "ఇక చాలమ్మా!" అంటూ వారించాడతడు.

"చాలా ఆలస్యం అయింది డాడ్. బాగా అలిసిపోయారు అమ్మ, మీరు కూడా. పడుకోండి, గుడ్‌నైట్" అంటూ నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు హేమంత్.

"పాపం వాడికి మనని విడిచి వెళ్ళాలన్న బాధ వుంది మనసులో. హేమంత్ బాధకూ అర్ధముంది. నాతోపాటు నీకూ విశ్రాంతి కరువైంది కదూ! పడుకో వసూ" అన్నాడూ ఆమె తల నిమురుతూ.

ఆమె గుండెలో దాగి వున్న దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. అతడిని చుట్టేసి బావురుమంది. అభిజిత్ కళ్ళు కూడా నిండాయి.

"వసూ, ఊరుకోమ్మా. హేమంత్ చూస్తే బాధపడతాడు" అంటూ ఆమెను లోనికి తీసుకువెళ్ళి పడుకోబెట్టి పక్కన కూర్చున్నాడు.

నెమ్మదిగా అతడి ఒడిలో తలపెట్టుకుంది వసుమతి.

"ఒక్కగానొక్క కొడుకు వాడి మనసు బాధపడుతుంది పాపం"

"వైజాగ్ వెళ్తే సంతోషంగా వుంటాడు వసూ. అక్కడ ప్రభావతి కొడుకు, కూతురు, ఇంకా గోపాల్ గొడుకు, కూతురు వీడితోటి వాళ్ళేగా, వాళ్ళతో కలిసి సంతోషంగా వుంటాడు" ఆమె పాదాలను ఒత్తుతూ అన్నాడతడు.

చటుక్కున పాదాలను వెనక్కు తీసుకుంది అతడికి అందకుండా వసుమతి.

"ఏ జన్మలో పుణ్యమో మీలాంటి దేవుడి సేవలు చేసుకోమని మీ చెంతకు చేర్చాడు ఆ భగవంతుడు" అంటూ అతడిని చుట్టేసుకుని దుఃఖాన్ని దిగమింగుకుంది ఆమె.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS